'సీతారామ' పనుల్లో వేగం పెంచాలి
కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మామిళ్లగూడెం, జనవరి 7: సీతారామ ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు పనుల పురోగతిపై ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిర్మాణ పనుల మ్యాప్‌లను పరిశీలించారు. సత్తుపల్లి ట్రంక్ పనులు, యాతాకులకంట టన్నెల్, జూలూరుపాడు టన్నెల్ పనుల వివరాలు, పంప్ హౌజ్‌ల పరిధిలో కాల్వల పరిస్థితి, పాలేరు నియోజకవర్గంలో లింక్ కెనాల్ ఏర్పాటు పనులు, భూసేకరణ, అటవీ భూముల స్థితిగతులు, ఇతర శాఖల అనుమతుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు పనులకు సంబంధించి భూసేకరణ పూర్తి చేయాలని, అధికారులు భూ నిర్వాసితులతో సంప్రదింపులు చేసి మిగులు భూమి సేకరణ పూర్తి చేయాలని ఆదేశించారు. అటవీ భూములకు సంబంధించి ఆ శాఖ నుంచి అనుమతులపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు చివరి ఆయకట్టు వరకు నీళ్లు ఇచ్చే విధంగా పనులను వేగవంతం చేయాలన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, డీఆర్వో రాజేశ్వరి, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

ప్రియదర్శినిలో సంక్రాంతి సంబురాలు

బోగి మంటలు వేస్తున్న అధ్యాపకులు, పాలు పొంగిస్తున్న మహిళలు

ఖమ్మం రూరల్, జనవరి 7: మండలంలోని ప్రియదర్శిని మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ముందస్తు సంక్రాంతి సంబురాలు జరిగాయి. కళాశాల ఆవరణలో విద్యార్థినులు వేసిన తీరొక్క ముగ్గులు, పండుగ వాతావరణం ఉట్టి పడే విధంగా గొబ్బెమ్మలు, హరిదాసు వేషధారణలు, బోగి పులగం, కట్టెల పొయ్యిపై పిండి వంటలు ఇలా అనేక సాంప్రదాయ పద్ధతిలో విద్యార్థులు జరుపుకున్నారు. సినిమా సెట్టింగ్‌ల మాదిరి మట్టి గుడిసెలు, అచ్చం పల్లెటూరిని తలపించే విధంగా ప్రశాంతమైన వాతావరణంలో ముందస్తుగా వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కాట్రెపల్లి నవీన్‌బాబు, ప్రిన్సిపాల్ బీ గోపాల్, డైరెక్టర్ వెంకటరమణ, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వసతి గృహంలో అధికారుల బస

వసతిగృహంలో నిద్రిస్తున్న అధికారులు

ఎర్రుపాలెం, జనవరి 7: మండలంలోని బనిగండ్లపాడులో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ బాలుర వసతిగృహంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ జిల్లా అధికారి, ఉపసంచాలకులు కస్తాల సత్యనారాయణ, మధిర సహాయ సంక్షేమ అధికారి కొత్త వెంకటేశ్వరరావు మంగళవారం రాత్రి బస చేశారు. విద్యార్థులకు అందించిన కార్పెట్, బెడ్‌షీట్, రగ్గు, షెట్టర్స్, స్పోర్ట్స్ డ్రస్, నాలుగు జతల దుస్తులు, నూతన మెనూపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదోతరగతిలో వంద శాతం ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమ అధికారి టీ.దశరద్, ట్యూటర్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్ పైపుల నిర్మాణానికి సర్వే

రఘునాథపాలెం, జనవరి 7 : ఎన్నెస్పీ కెనాల్‌పై రూ.66 కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టే లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి సంబంధించిన పైప్‌లైన్ నిర్మాణానికి అధికారులు మంగళవారం సర్వే నిర్వహించారు. ఎన్నెస్పీ ప్రధాన కాలువ వీ వెంకటాయపాలెం నుంచి చింతగుర్తి వరకు పైపులైన్ నిమిత్తం ఇరిగేషన్ డీఈ ఝాన్సీ సర్వే నిర్వహించారు. ఎత్తిపోతల పథకంతో 30 చెరువులకు నీరందడంతోపాటు 2,400ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. చెరువులను నింపేందుకు లింక్ పైపులైన్ల నిర్మాణం జరుగుతుందని డీఈ తెలిపారు. ఏఈ శ్రీరాం, ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

లూయిస్ బ్రెయిలీ జయంతి

ఖమ్మం వ్యవసాయం, జనవరి 7: అంధుల ఆరాధ్య దైవం లూయిస్ బ్రెయిలీ 216 జయంతి వేడుకలు మంగళవారం జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జరిగాయి. ముఖ్యఅతిథిగా జిల్లా సంక్షేమ అధికారి కే రాంగోపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఖమ్మం నగరం పాకబండ పార్కులోని బ్రెయిలీ విగ్రహానికి డీడబ్ల్యూవో స్థానిక కార్పొరేటర్ షేక్ ముక్బుల్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో విజువల్లి చాలెంజెడ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, వీరబాబు, నాగేంద్రమ్మ, ఎమ్మెస్ రావు, వసంతరావు, జ్యోతి నివాస్ పాఠశాల అంధ విద్యార్థులు పాల్గొన్నారు.

పాలేరులో ఇందిరమ్మ ఇండ్ల సర్వే 93 శాతం పూర్తి

కూసుమంచి, జనవరి 7: పాలేరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 70,918 మంది ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకోగా వారిలో 66,422 మంది దరఖాస్తుల దారుల ఇండ్లను యాప్ ద్వారా మంగళవారం నాటికి సర్వే పూర్తి చేశారు. కూసుమంచిలో 15,754 ఇండ్లు, ఖమ్మం రూరల్‌లో 21,161, తిరుమలాయపాలెం లో 15,687, నేలకొండపల్లి మండలంలో 13,820 ఇండ్ల సర్వే పూర్తి చేశామన్నారు. మరో రెండు రోజుల్లో కూసుమంచి, ఖమ్మం రూరల్ మండలాల్లో సర్వే పూర్తవుతుందని తెలిపారు. కూసుమంచి మండలంలో మంగళవారం ముత్యాలగూడెంలోని ఇండ్ల సర్వేను ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి పరిశీలించారు. .

'ప్రతిజ్ఞ' సందేశంపై అవగాహన

పెనుబల్లి, జనవరి 7: కల్లూరు మండలంలోని చెన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ సందేశంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రచయిత ఎం రాంప్రదీప్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తి, సోదరభావం పెంచేందుకు పైడిమర్రి వెంకటసుబ్బారావు 'భారతదేశం- నా మాతృభూమి' ప్రతిజ్ఞ రాశారన్నారు. ప్రతిజ్ఞ పాఠ్యపుస్తకాల్లో చేరి 60 ఏళ్లు అయిందని, ప్రతిజ్ఞ పదాలు చాలా సులభంగా ఉంటాయన్నారు. హెచ్‌ఎం పీ.మధు, ఉపాధ్యాయురాలు డీ.శిరీష పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలి

తిరుమలాయపాలెం, జనవరి 7: వాహనదారులు ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలని ఎస్సై జగదీష్ అన్నారు. తిరుమలాయపాలెంలో మంగళవారం పోలీసులు రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా వాహనదారులకు హెల్మెట్ ఉపయోగాలను వివరించారు. హెల్మెట్ లేని వాహనదారులకు హెల్మెట్ అందజేశారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

అడవి, చెరువులే మన ఆస్తి.. వాటిని రక్షించాలి

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

అర్బన్‌పార్క్‌కు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, పక్కన అధికారులు

ఎర్రుపాలెం, జనవరి 7: అడవి, చెరువులే మన ఆస్తి వాటిని రక్షించాలి బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. మంగళవారం ఆయన మండలంలో పర్యటించి సీసీరోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మండలంలోని జమలాపురంలో ఏర్పాటు చేసిన సభలో భట్టి మాట్లాడారు. అటవీశాఖ పరిధిలో ఎకో టూరిజం అభివృద్ధి చేయాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. అడవులను ధ్వంసం చేయకుండా, దానిని అస్వాధీస్తూ బతికేందుకు అవసరమైన కాటేజి అభివృద్ధి చేస్తే టూరిజం పెరుగుతుందన్నారు. టూరిజం ఆరు నెలల్లో అటవీపార్క్ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. ఇండియా టూరిజం మ్యాప్‌లో ఎర్రుపాలెం మండలానికి ప్రత్యేక స్థానం కల్పించేలా పర్యాటకంగా మండలాన్ని అభివృద్ధికి పటిష్ట ప్రణాళికలు తయారు చేస్తున్నారని భట్టి అన్నారు. జమలాపురం ఆలయ పరిసర ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రజలు ఆకాంక్షించారని, దీనిని దృష్టిలో ఉంచుకొని గతంలో జమలాపురం చెరువు ట్యాంకు బండ్‌గా అభివృద్ధి చేస్తున్నామన్నారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ డిజైన్ నుంచి తుది అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన వరకు ప్రజలకు ఉపయోగపడే విధంగా జమలాపురం ఆలయానికి వచ్చే భక్తులు ఆహ్లాదంగా గడిపేలా ఉపముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ వహించారన్నారు. చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ భీమానాయక్ మాట్లాడుతూ అటవీని సంరక్షిస్తూ ఇక్కడ ఆహ్లాదకరమైన పరిస్థితులు ఏర్పాటు చేసేందుకు అర్బన్‌పార్క్ కార్యాచరణ తయారు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పీ.శ్రీజ, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఎంపీడీవో మంజుల, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాలేరులో 93 శాతం పూర్తయిన ఇందిరమ్మ ఇండ్ల సర్వే

కూసుమంచి, జనవరి 7: పాలేరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 70,918 మంది ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకోగా వారిలో 66,422 మంది దరఖాస్తుల దారుల ఇండ్లను యాప్ ద్వారా మంగళవారం నాటికి సర్వే పూర్తి చేశారు. కూసుమంచిలో 15,754 ఇండ్లు, ఖమ్మం రూరల్‌లో 21,161, తిరుమలాయపాలెం లో 15,687, నేలకొండపల్లి మండలంలో 13,820 ఇండ్ల సర్వే పూర్తి చేశామన్నారు. మరో రెండు రోజుల్లో కూసుమంచి, ఖమ్మం రూరల్ మండలాల్లో సర్వే పూర్తవుతుందని తెలిపారు. కూసుమంచి మండలంలో మంగళవారం ముత్యాలగూడెంలోని ఇండ్ల సర్వేను ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి పరిశీలించారు. మిగిలి పోయిన గ్రామాల్లో త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

రేపు కలెక్టరేట్ ఎదుట ధర్నా

కొణిజర్ల, జనవరి 7: అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆ సంఘం వైరా డివిజన్ కార్యదర్శి పాశం అప్పారావు అన్నారు. ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం పోస్టర్లను ఆవిష్కరించారు. సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ నాయకులు నునావత్ శ్రీను, పీవోడబ్ల్యూ నాయకులు పాల్గొన్నారు.

108ను తనిఖీ చేసిన అధికారులు

కొణిజర్ల, జనవరి 7: ఉద్యోగుల పనితీరుపై, పరికరాల పనితీరుపై మంగళవారం 108 జిల్లా ఇన్‌చార్జి(ఈఎంఈ) దుర్గాప్రసాద్ కొణిజర్ల 108 వాహనాన్ని తనిఖీ చేశారు. ప్రజలకు 108 సిబ్బంది అందుబాటులో ఉండి అత్యున్నత సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కొమ్ము వెంకటేశ్, పైలెట్ బోరిమల్ల రామారావు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

వైరా రూరల్: మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ

వైరా రూరల్, జనవరి 7: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ ఆదేశించారు. మండలంలోని గరికపాడు హైస్కూల్‌ను మంగళవారం ఆమె సందర్శించారు. పాఠశాల పరిసరాలు, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజన వంట గదిని, మెనూను పరిశీలించారు. ఆమె మాట్లాడారు. 9,10 తరగతి విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తర్ఫీ దు ఇవ్వాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులకు రివిజన్ పరీక్షలు నిర్వహించి వెనుకబడిన విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నా రు. అనంతరం పాఠశాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట హెచ్‌ఎం సత్యనారాయణ ఉన్నారు.

పెద్దగోపతి జడ్పీ ఉన్నత పాఠశాల సందర్శన

కొణిజర్ల, జనవరి 7: మండలంలోని పెద్దగోపతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ మంగళవారం సందర్శించారు. పాఠశాలలో ఎండీఎం బియ్యం నాణ్యతను పరిశీలించారు. సింగరాయపాలెం జడ్పీహెచ్‌ను సందర్శించి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పదోతరగతి విద్యార్థులతో మాట్లాడి మంచిగా చదువుకొని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో అబ్రహ్మం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముఖేష్ హత్య నిందితులను కఠినంగా శిక్షించాలి

ర్యాలీలో పాల్గొన్న జర్నలిస్టులు

ఖమ్మం, జనవరి 7: జాతీయ మీడియా జర్నలిస్ట్ ముఖేష్ చంద్రకర్‌ను పాశవికంగా హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) రాష్ట్ర నాయకత్వం పిలుపులో భాగంగా జర్నలిస్ట్ ముఖేష్ చంద్రకర్ హత్యను నిరసిస్తూ మంగళవారం ఖమ్మం నగరంలో పెవిలియన్ గ్రౌండ్ నుంచి మయూరిసెంటర్ మీదుగా జిల్లా పరిషత్ సెంటర్ అంబేద్కర్ విగ్రహం వరకు ద్విచక్ర వాహనాలతో జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలతో ర్యాలీ నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ మాట్లాడుతూ వృత్తిపరంగా వాస్తవాలను ప్రజలకు తెలియజేస్తూ అవినీతిని బయటపెట్టి జర్నలిస్టులకు ప్రభుత్వాలు భద్రత కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందాయని విమర్శించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు ఆర్‌టీవీ ఉదయ్, ఉపేందర్, టీఎస్ చక్రవర్తి, నాగరాజు, షేక్ జానీపాషా, శ్రీధర్‌శర్మ, కోటేశ్వరరావు, రమేష్‌బాబు, రాంబాబు, గోపి, జీవన్‌రెడ్డి, అశోక్, సాయి, శ్రీనివాస్, నగేష్, వెంకటేశ్వరరెడ్డి, మోహన్, వెంకటేశ్వర్లు, బాబు, రాజేంద్రప్రసాద్, కృష్ణారావు, రవీందర్, తిరుపతిరావు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేయాలి

కొణిజర్ల, జనవరి 7: సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేయాలని ఎంఎస్‌పీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తూరుగంటి అంజయ్య తెలిపారు. మంగళవారం ఎమ్మార్పీఎస్ నాయకులు బెల్లంకొండ రవి మాదిగ అధ్యక్షతన కొణిజర్లలో ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు కోరుతూ ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే మాదిగల లక్షలాది డబ్బుల వేలాది గొంతుల మహాప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం విజయవంతానికి జిల్లా వ్యాప్తంగా మాదిగ, అణగారిన కులాల కళాకారుల ఆధ్వర్యంలో రథయాత్ర పేరుతో ప్రతి పల్లె తిరిగి చైతన్యం చేస్తారమని పేర్కొన్నారు. జిల్లాలో త్వరలో జరిగే మందకృష్ణమాదిగ మహాప్రదర్శనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బెల్లంకొండ రవి, మఙిలారపు మురళీ, ఎంఎస్‌పీ నాయకులు భాస్కర్, పెద్దశ్రీను, చిన్నశ్రీను, రవికుమార్, సుధాకర్, భద్రయ్య, జయన్న, చిన్నకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం హామీలను అమలు చేయాలి

బోనకల్లు, జనవరి 7: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తాత్సారం చేస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో బంధం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. త్వరలో జరుగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో లబ్ధిపొందేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా, నిరుపేదలకు రూ.12 వేలు అమలు చేస్తామని హడావిడిగా ప్రకటించిందన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క పథకం పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. అరకొర పథకాలు అమలు చేస్తూ రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. రైతు రుణమాఫీ పూర్తిస్థాయి అమలు చేశామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం బాధ్యతా రాహిత్యమన్నారు. సమావేశంలో నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, మడుపల్లి గోపాలరావు, చింతలచెరువు కోటేశ్వరరావు, దొండపాటి నాగేశ్వరరావు, కిలారు సురేశ్, తుల్లూరి రమేశ్, చిట్టిమోదు నాగేశ్వరరావు, జొన్నలగడ్డ సునీత, తెల్లాకుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలి

తిరుమలాయపాలెం, జనవరి 7: విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని జిల్లా హార్ట్‌ఫుల్‌నెస్ కోఆర్డినేటర్ కరుణాకర్ అన్నారు. మండలంలోని పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో మంగళవారం ఇంటర్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్ప్ ప్రోగ్రాం విద్యార్థుల సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ పీవో నారాయణ రావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపవద్దు

వైరాటౌన్, జనవరి 7: వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపవద్దని అసిస్టెంట్ మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.రవిచంద్ర అన్నారు. రాష్ట్ర రోడ్డు రవాణా మాసోత్సవాల సందర్భంగా మంగళవారం వైరాలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వాహనాలను వేగంగా నడిపి ప్రమాదాలకు గురికావద్దని, వాహనాలను నడిపేటప్పుడు మీ కుటుంబ సభ్యులు మీకు గుర్తొచ్చే విధంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో వాహనదారులు పాల్గొన్నారు.

భూ భారతిలో సమగ్ర భూ సర్వే చేపట్టాలి

వైరాటౌన్, జనవరి 7: రాష్ట్ర ప్రభుత్వం ధరణి పోర్టల్ స్థానంలో ఏర్పాటు చేసిన భూ భారతిలో సమగ్ర భూ సర్వేకి ప్రాధాన్యత ఇచ్చి, సాగు భూమి అనుభవంలో ఉన్న ప్రతి రైతుకు భూ ఆధార్‌కార్డు ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. మంగళవారం ఏన్కూరు ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగిన రైతు సంఘం సమావేశంలో రాంబాబు మాట్లాడారు. కౌలు రైతులకు గ్రామసభల ద్వారా గుర్తింపు కార్డులు జారీ చేసి ప్రభుత్వ సబ్సిడీ పంట నష్టపరిహారం, బ్యాంకు రుణం, అందించాలని కోరారు. రైతాంగ సమస్యల కోసం బుధవారం ఖమ్మం అర్బన్ మండలం కొత్తగూడెం గ్రామంలో జిల్లా రైతు సదస్సు నిర్వహించడం జరుగుతుందని, సదస్సులో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ పాల్గొంటారని అన్నారు. సమావేశంలో నాయకులు దొంతిబోయిన నాగేశ్వరరావు, నండూరి శ్రీనివాసరావు, నేల్లపట్ల వెంకటేశ్వరరావు, ఇటికాల లెనిన్ పాల్గొన్నారు.

వేమన పద్య పోటీల్లో టాలెంట్ విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లి, జనవరి 7: ఏపీలోని అనంతపురం జిల్లాలో గల వేమన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేమన పద్య పఠన పోటీల్లో పట్టణంలోని టాలెంట్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులు అందుకున్నారు. పద్యపఠన పోటీల్లో సీనియర్స్ విభాగంలో కొడాలి సుష్మిత ప్రథమ, కొట్టే మౌనిశ ద్వితీయ, పుప్పాళ్ల కావ్య తృతీయ జూనియర్స్ విభాగంలో చిన్నంశెట్టి లాస్యశ్రీ ప్రథమ, షేక్ అఫ్సియా ద్వితీయ, రుత్విజ్‌వకుల్‌సావర్కర్ తృతీయ స్థానం పొందారు. వీరికి సృజనా సాహిత్య సమాఖ్య నిర్వాహకులు మధుసూదన్‌రాజు, రామకృష్ణ, స్కూల్ కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ పులి అరుణలు గోల్డ్‌మెడల్, షీల్డ్, ప్రశంసాపత్రాలు అందజేశారు. అదేవిధంగా 25 మంది విద్యార్థులకు వంద పద్యాలు పఠనం చేసి ప్రశంసాపత్రాలు అందుకున్నారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.

పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో

మధిర రూరల్, జనవరి 7: మండలంలోని మాటూరుపేట పీహెచ్‌సీని మంగళవారం డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిభాయి సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్యం గురించి తెలుసుకుని, రికార్డులను పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. గర్భిణీలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు చేసుకునే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు వీరబాబు, శరత్‌బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంక్రాంతికి 1,030 ఆర్‌టీసీ బస్సులు

ఖమ్మం, జనవరి 7: సంక్రాంతి పండుగ సందర్భంగా ఆర్టీసీ ఖమ్మం రీజియన్ పరిధిలో 1,030 బస్సులను అదనంగా నడపడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని రీజనల్ మేనేజర్ సరిరాం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈ నెల 9 నుంచి 20వ తేదీ వరకు బస్సులు నడపనున్నట్లు తెలిపారు. అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం గల బస్సుల్లో టికెట్స్ ఆన్‌లైన్ లేదా దగ్గరలోని బస్టాండ్‌లో రిజర్వేషన్ చేసుకోవచ్చునని ఆర్‌ఎం పేర్కొన్నారు.

నాయీ బ్రాహ్మణుల ర్యాలీ

ఖమ్మం, జనవరి 7: ఖమ్మం నగర నాయీ బ్రాహ్మణ సంఘ ఎన్నికల్లో ఎలమందల జగదీష్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా మంగళవారం విజయోత్సవ సంబురాలు జరుపుకున్నారు. రోటరీనగర్‌లోని శ్రీ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం నగరంలో ప్రధాన కూడళ్లను కలుపుతూ భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జగదీష్ మాట్లాడుతూ తనతో పాటు కార్యదర్శిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. సురభి సైదులు, శ్రీరాముల విజయ్, అద్దంకి పాపారావు, సందీప్, రాఘవేందర్, శీను, నాగేశ్వరరావు, రామనాథం పాల్గొన్నారు.

సర్వజ్ఞ విద్యార్థుల ర్యాలీ

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 7 : ఖమ్మం నగరంలోని సర్వజ్ఞ పాఠశాల విద్యార్థులు రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. వేగం కన్నా ప్రాణం మిన్నా అనే నినాదాలతో అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు ఎస్ఐ సాగర్ ట్రాఫిక్ సిగ్నల్స్, నిబంధనల గురించి వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆర్‌వీ నాగేంద్రకుమార్, నీలిమ, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యూఇరాలో శిక్షణ తరగతులు

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 7 : ఖమ్మం నగరంలోని న్యూఇరా పాఠశాలలో మంగళవారం గణిత, సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. దేశంలోని ఐఐటీ, ఎన్ఐటీ వంటి అత్యుత్తమ విశ్వవిద్యాలయాలోని బృందం ద్వారా ఒపెన్ డోర్ ప్రోగ్రామ్‌లు రూపొందించబడ్డాయని, 2025-26లో థింకింగ్ క్లాస్‌రూమ్‌ని పరిచయం చేయబోతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో చైర్మన్ ఐవీ రమణారావు, డైరెక్టర్ డాక్టర్ పి.భూమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 7: సంక్షేమ గురుకులాల్లో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డీఆర్‌వోకి వినతిపత్రం అందజేశారు. విద్యార్థి మృతికి కారణాలపై దృష్టి సారించి, ప్రిన్సిపాల్, వార్డెన్‌ను సస్పెండ్ చేయాలన్నారు. కార్యక్రమంలో నాగులమీరా, శివనాయక్, గౌతమ్ పాల్గొన్నారు.

డిజిటల్ బ్యాంకింగ్‌పై అవగాహన

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 7: ఖమ్మం నగరంలోని ఎస్ఆర్ అండ్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆర్‌బీఐ ఆధ్వర్యంలో డిజిటల్ బ్యాంకింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రారంభించిన ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మెన్ స్కీంలో భాగమైన బ్యాంకింగ్ డిజిటల్ చెల్లింపులు, ఆర్థిక సేవలకు సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరించే అంశాలను బ్యాంక్ అధికారులు వివరించారు. ఆర్‌బీఐ ప్రతినిధి హెచ్‌డీ దైమని మాట్లాడుతూ ఆన్‌లైన్ బ్యాంకింగ్‌లో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు శాస్త్రి, రెడ్డి, మాధవి, సునంద పాల్గొన్నారు.

'ప్రమాదరహిత జిల్లాగా నిలుపుదాం'

రఘునాథపాలెం, జనవరి 7: ఖమ్మం జిల్లాను రోడ్డు ప్రమాదరహిత జిల్లాగా నిలుపుదామని అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రెంటాల స్వర్ణలత పిలుపునిచ్చారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా రవాణాశాఖ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో బైపాస్ రోడ్డులోని పలు ప్రాంతాల్లో వాహనదారులకు అవగాహన కల్పించారు. రవాణాశాఖ నిబంధనలను పాటిస్తూ వాహనాలను నడపాలని సూచించారు. కార్యక్రమంలో నూతన ఏఎంవీఐలు గోపీ కృష్ణ, సుమలత, కానిస్టేబుళ్లు తలారి రమేశ్, లక్ష్మీప్రసన్న ఉన్నారు.

రోడ్డు భద్రత ప్రతిఒక్కరి సామాజిక బాధ్యత

సత్తుపల్లి, జనవరి 7: రోడ్డు భద్రతా ప్రతిఒక్కరి సామాజిక బాధ్యత అని సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి అన్నారు. మంగళవారం రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. 'రోడ్డు భద్రత సామాజిక బాధ్యత' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం కార్యక్రమంలో ఎంఈవో నివేదిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విలేజ్ బస్సు ఆఫీసర్ ఆనందరావు పాల్గొన్నారు.

'రోడ్ సేఫ్టీ'పై అవగాహన సదస్సు

వైరాటౌన్, జనవరి 7: వైరా మున్సిపాలిటీ పరిధిలోని పల్లిపాడు కార్తీక్ విద్యాలయంలో రోడ్ సేఫ్టీపై విద్యార్థులకు వైరా మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత నిబంధనను పాటించాలని, ప్రతి వాహనదారుడు ద్విచక్ర వాహనంపై వెళ్లేటప్పుడు హెల్మెంట్, కారు సీటుబెల్టు ధరించాలని అన్నారు. కార్యక్రమంలో ట్రైనీ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రవిచంద్ర, సిబ్బంది, కార్తీక్, విద్యాలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

వరి సాగుపై రైతులకు అవగాహన

కారేపల్లి, జనవరి 7: నేరుగా విత్తనాలను చల్లే పద్ధతిలో వరి సాగు చేసే విధానంపై ఫెర్టిలైజర్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని రైతులకు అవగాహన కల్పించారు. ఆ సంస్థ కోఆర్డినేటర్లు ధరావత్ హుస్సేన్, గూడూరు వెంకటేశ్వర్లు మండలంలోని పలు గ్రామాలలో పర్యటించి రైతులను కలిశారు. ఈపద్ధతి వల్ల రైతులకు నాటు ఖర్చులతో పాటు నీళ్లు ఆదా అవుతాయని, దిగుబడి త్వరగా వచ్చి పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయన్నారు.

బ్యాంకు మేనేజర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

మధిర(చింతకాని), జనవరి 7: చింతకాని మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన ఆళ్ల అజయ్‌కుమార్ తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్‌పై జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు మంగళవారం ఫిర్యాదు చేశాడు. రైతు రుణ మాఫీ కింద రూ.16,500 మాఫీ వచ్చిందని, తిరిగి లోను తీసుకునేందుకు బ్యాంకు మేనేజర్ దగ్గరకు వెళ్లానని తెలిపారు. నాన్న గారి పేరుమీద లోను ఉన్నందున తనకు లోను ఇవ్వడానికి నిరాకరిస్తున్నాడని తెలిపారు. నాగులవంచ బ్రాంచ్ మేనేజర్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడని, అప్పు మీరే కట్టాలని, లేకపోతే తిరిగి అప్పు ఇచ్చేది లేదని చెబుతున్నారని కలెక్టర్ చేసిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ విషయంపై విచారించి తనకు తిరిగి లోను ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

రెండు ఇళ్లలో చోరీలు

మామిళ్లగూడెం, జనవరి 7 : ఖమ్మం నగరంలో దొంగలు విజృంభిస్తున్నారు. కొంతకాలంగా వరస దొంగతాలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసరుతున్నారు. సోమవారం రాత్రి మామిళ్లగూడెం, బ్యాంకుకాలనీ ప్రాంతాల్లో చోరీ జరిగింది. మామిళ్లగూడెంలో నివాసం ఉంటున్న వనం బాబు ముదిగొండ సొసైటీ డైరెక్టర్‌గా ఉన్నారు. ఆయన ఇంట్లో సోమవారం రాత్రి దొంగలు పడి బీరువాలోని 12 తులాల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు ఎత్తుకెళ్లారు. బ్యాంక్‌కాలనీలో ఉంటున్న రిటైర్డ్ పోస్ట్‌మాస్టర్ దొడ్డ నాగేశ్వరరావు ఇంట్లో బీరువా పగులగొట్టి 185 గ్రాముల బంగారు అభరణాలు, 20 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. టూటౌన్ సీఐ బాలకృష్ణ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

సత్తుపల్లి, జనవరి 7: మండలంలోని కిష్టాపురం గ్రామ శివారులోగల పామాయిల్ తోటలో మంగళవారం పేకాట నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.22,500, రెండు సెల్‌ఫోన్లు, ఓ మోటార్‌సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా పామాయిల్ తోట యజమాని అయిన సుబ్బారావుపై కేసు నమోదు చేశారు.

పేకాట నిర్వాహకులపై బైండోవర్ కేసులు

సత్తుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో 13 సంవత్సరాలుగా పేకాట, కోడిపందాల కేసుల్లో నిందితులుగా ఉన్న వారు కోడికత్తులు తయారు చేసేవారు, కోడికత్తులు కట్టే వారు, పేకాటరాయుళ్లు 25 మందిని మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ కే.కిరణ్ సంక్రాంతి పండుగ సందర్భంగా వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. భవిష్యత్‌లో పేకాట, కోడిపందాల్లో పాల్గొనకుండా మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి రూ.లక్షకు బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా సీఐ కిరణ్ మాట్లాడుతూ మండలంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఎటువంటి ఆర్గనైజింగ్ కోడిపందాలు, పేకాట నిర్వహించినట్లయితే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేకాట, కోడిపందాల సమాచారం గురించి డయల్ 100కు కానీ, సత్తుపల్లి సీఐ నెంబర్ 8712659167 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

అక్రమ మట్టి తవ్వకాల ప్రాంతాల్లో టాస్క్‌ఫోర్స్ దాడులు

తిరుమలాయపాలెం, జనవరి 7: తిరుమలాయపాలెం-ములకలపల్లి రహదారి సమీపంలో అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తున్న ప్రాంతాన్ని మంగళవారం టాస్క్‌ఫోర్స్ ఖమ్మం సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేశారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వకాలు చేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు ఈ ప్రాంతంలో దాడులు నిర్వహించినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. మట్టి తవ్వకాలు చేస్తున్న ప్రాంతంలో బ్లాస్టింగ్ కంప్రెషర్, ప్రోక్లైనర్ ఆపరేటర్లను పట్టుకొని స్థానిక పోలీస్‌స్టేషన్లో అప్పగించారు. అక్రమ మట్టి క్వారీ విషయమై సమగ్ర విచారణ జరపాలని ఎస్సై జగదీశ్‌ను టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ ఏఎస్సై చారీ, హెడ్‌కానిస్టేబుల్ హరి, సిబ్బంది పాల్గొన్నారు.

300 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

రఘునాథపాలెం, జనవరి 7 : ఖమ్మం నగర పరిధి ఇండస్ట్రియల్ ఏరియాలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని ఖానాపురం హవేలీ పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. సీఐ భానుప్రకాశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పాత రైస్‌మిల్లులో రేషన్ బియ్యం నిల్వ చేసి ఉన్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి 600 బస్తాల్లో 300క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. షేక్ నజీర్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.